# సంపూర్ణ ఆరోగ్యానికి చిరునామా.. ఓపెన్ జిమ్

- ఆహ్లాదం పంచుతున్న పార్కులు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

సైదాబాద్, నవంబర్ 5 : తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నది. కాలనీవాసుల సంపూర్ణ ఆరోగ్యం కాలనీ పార్కులను కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి చేసింది. కాలనీవాసుల వ్యక్తిగత బాడీ ఫిట్‌నెస్‌కు ఆధునిక క్రీడా పరికరాలతో ఓపెన జిమ్‌లను అందుబాటులోకి తెచ్చింది. మలక్‌పేట నియోజకవర్గంలో ప్రతి డివిజన్ అన్ని కాలనీల పార్క్‌లను సుందరంగా తయారుచేసి ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేశారు. చక్కని శరీరాకృతికోసం యువత పార్కుల్లోని జిమ్‌లను అనువైన ప్రదేశాలుగా ఎంచుకుంటున్నారు. బయటి జిమ్‌లకు వెళ్తే వేలాది రూపాయలను చెల్లించాల్సి ఉండడంతో ఇక్కడికి క్యూ కట్టారు.

### వందలాది మందితో కిటకిటలాడుతూ..

మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలోని పార్కులు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. కాంక్రిట్ జంగిల్‌గా మారిన నగరంలో నానాటికి కాలుష్యం పెరుగుతుండటం, దైనందిత జీవితంలో నిత్యం బిజీగా ఉంటున్నారు. నగరవాసులు ఆరోగ్యకర వాతావరణం,ఆహ్లాదకర ప్రదేశాలకోసం పడుతున్న పాట్లు ఇన్నీ అన్నీ కావు. ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం కోసం పార్కులను ఆశ్రయిస్తుడటంతో పార్కులన్నీ సందడిగా మారుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం వందలాది మందితో కిట కిటలాడుతున్నాయి. తెల్లవారు జామున 5 గంటల నుంచి యువతీయువకులు, మహిళలు మొదలుకొని వయోవృద్ధుల వరకు అందరూ ఆరోగ్యం కోసం వాకింగ్, యోగాసనాలు, ఫిట్‌నెస్, వ్యాయామం కోసం పార్కులను ఆశ్రయిస్తున్నారు. పార్కుల్లో వాకర్ ట్రాక్‌లు, క్రీడాపరికరాలతో పాటు పచ్చని లాన్లు, చెట్లు, పూలమొక్కలు ఏర్పాటు చేశారు. మరోవైపు, ఆహ్లాదం కోసం, పిల్లల ఆట విడుపుకోసం పార్కులు వచ్చేవారి సంఖ్య నానాటికీ పెరిగి పార్కులు సందడిగా మారాయి.



పట్టన్‌లో జిమ్‌ను ప్రారంభించిన మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల (ఫైల్)



ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు

### ఓపెన్ జిమ్‌ల కోసం పెరుగుతున్న ఒత్తిడి

జీహెచ్ఎంసీ ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లను ప్రతి కాలనీలో పెట్టాలని కాలనీ సంక్షేమ సంఘాల నుంచి కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది. ఇతర కాలనీలో వెళ్లకుండా తమ కాలనీ పార్క్‌లో ఏర్పాటు చేయాలని కోరుతుండటంతో డిమాండ్ పెరిగింది. ఉచితంగా పార్కుల్లోనే శిక్షణ ఇస్తుండటంతో పార్కులకు వచ్చేవారందరూ ఓపెన్ జిమ్‌లపై ఆసక్తి చూపిస్తుండటంతో రోజు రోజుకు ఆదరణ పెరుగుతున్నది.

## పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి



ఓటు వేయాలని అడుగుతున్న మలక్‌పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి

సైదాబాద్, నవంబర్ 5 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని మలక్‌పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మూసారాంబాగ్ డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆధికారంలోకి తీసుకొని రావటానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, తమ విలువైన ఓటును వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ప్రచారం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్లు తీగల సునరితారెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డి, రఘునంద్ రెడ్డి, రాధ, లలిత, కుమార్, మహేశ్, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



గెలిపించాలని కోరుగుతున్న మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి



గడ్డిఅన్నారంలో ప్రచారంలో పాల్గొన్న మలక్‌పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి

## సేవ చేసే వారికే ఓటు వేయండి



అక్బర్‌బాగ్ చౌరస్తాలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, బలాల

సైదాబాద్, నవంబర్ 5 : కరోనా అపత్కాలంలో ప్రజలకు సేవ చేయటానికి ముందుకురాని వారందరూ ఎమ్మెల్యే టికెట్లతో వస్తున్నారని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మలక్‌పేట నియోజకవర్గం ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి అహ్మద్ బలాలకు మద్దతుగా ఆదివారం రాత్రి అక్బర్‌బాగ్ చౌరస్తాలోని మొఘల్ మార్ట్ సమీపంలో జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజా సమస్యలపై అవగాహన లేని వ్యక్తులు డబ్బు సంచులతో వచ్చారని, టికెట్లు కొనుగోలు చేసినట్లుగా ఓటర్లను డబ్బులతో ఆకట్టుకోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కరోనా కష్ట కాలంలో నాలుగు నెలలపాటు ప్రజలందరికీ అహ్మద్ బలాల చేసిన సేవా కార్యక్రమాలను నేటికి మరిచిపోలేదన్నారు. ఎంఐఎం అంటేనే ప్రజలకు పనిచేసే పార్టీ గుర్తింపు పొందిందన్నారు. మలక్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి బలాల మాట్లాడుతూ.. మలక్‌పేట నియోజక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించటానికి శక్తివంచన లేకుండా పనిచేశానని తెలిపారు. మరోసారి గెలిపిస్తే మలక్‌పేటను నగరంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, స్థానిక ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.




అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ పోలీస్ బలగాలతో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ పోలీసులు నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో డీసీపీ వెంకటేశ్వర్లు, అడిషనల్ డీసీపీ ఆనంద్, ఏసీపీ చంద్ర శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. **- అబిడ్స్, నవంబర్ 5**

## ఎస్బీహెచ్ బ్యాంక్ పంచ కాలనీ వాసుల మద్దతు



బలాలకు మద్దతు తెలుపుతున్న సైదాబాద్ ఎస్బీహెచ్ బ్యాంక్ పంచ కాలనీల మహిళలు



సైదాబాద్ ఎస్బీహెచ్ బ్యాంక్ పంచ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో బలాల

సైదాబాద్, నవంబర్ 5 : కాలనీలను అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడికే తామంతా ఓట్లు వేస్తామని సైదాబాద్ ఎస్బీహెచ్ పంచకాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కుల, మత, వర్గాలకు అతీతంగా పనిచేసే వారిని ఎన్నుకోవాలని నిర్ణయించుకొన్నామని, ఆ దిశగా తామంతా ఏకగ్రీవంగా ఏకాభిప్రాయానికి వచ్చామని తెలిపారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్ బ్యాంక్ కాలనీలు, ఎస్బీహెచ్-ఏ కాలనీ, బీ-కాలనీ, సీ-కాలనీ, జీఏ-1 కాలనీ, జీఏ-2 కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి తమ సంపూర్ణ మద్దతును ఎంఐఎం అభ్యర్థి అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలకు ప్రకటించారు. పంచకాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు కార్యవర్గం, కాలనీవాసులంతా అసెంబ్లీ ఎన్నికల్లో అహ్మద్ బలాలకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఎస్బీహెచ్ పంచ కాలనీల సమన్వయం కమిటీ చైర్మన్ రావికంటి శ్రీనివాస్ గుప్తా బహిరంగంగా ప్రకటించారు.

### అభివృద్ధి చూసి ఓటు వేయండి

ఎస్బీహెచ్ బ్యాంక్ పంచ కాలనీల్లో జరిగిన అభివృద్ధి చూసి ఓట్లు వేయాలని మలక్‌పేట ఎంఐఎం అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. ఆదివారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్-సీ కాలనీ సామాజిక భవనంలో జరిగిన పంచ కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలను వెచ్చించి ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరించానని తెలిపారు. కాలనీ వాసులందరూ ఓట్లు వేసి గెలిస్తే మరింత అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. పంచ కాలనీల సమన్వయ కమిటీ చైర్మన్ రావికంటి శ్రీనివాస్ గుప్త, శ్రీధర్, ఎస్బీహెచ్-ఎ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఉదయ్, రవి కుమార్, బి-కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అమ్రేశ్ మాతూర్, సీ-కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, ఎంఎన్. చారి, జీఏ-1 కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, రామరాజు, జీఏ-2 కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ మురళి, రమణ మూర్తి పాల్గొన్నారు.

### బ్యాంక్ కాలనీల దారిలో మార్వాడీ సమాజం

అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలో ఆనంద్‌నగర్‌లో ఆదివారం స్థానిక నాయకుడు నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంఐఎం ఎన్నికల డివిజన్ కార్యాలయాన్ని అభ్యర్థి అహ్మద్ బలాల ప్రారంభించారు. అక్బర్‌బాగ్ డివిజన్లలోని జైన్ సమాజ్, అగర్వాల్ సమాజ్, మహేశ్వరి సమాజ్, రాజస్తాన్ చౌదరి సమాజ్‌లకు చెందిన ప్రతినిధులు పాల్గొని బలాలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాలనీల్లో ఉన్న యువతతోపాటు ఆయా మార్వాడీ సమాజాలకు చెందిన ఓట్లు వేసి భారీ మెజార్టీతో బలాలను గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగరాజ్ గౌడ్, యోగేశ్ సింఘీ, కౌషల్ రాజ్‌జైన్, అస్వాక్ సింఘీ, ఫరాస్ జైన్, రాజేశ్ అగర్వాల్, పరివార్ ప్రసాద్ అగర్వాల్, చెంచు రామయ్య, సందీప్ జైన్, సూగూరు రమేశ్,రాజ్‌కుమార్ గుప్తా, నారాయణరెడ్డి, జయకుమార్ రెడ్డి, ప్రవీన్ పాండ్య, దినేశ్ పాల్గొన్నారు.



అక్బర్‌బాగ్ డివిజన్‌లో ఎంఐఎం అభ్యర్థి బలాలకు మద్దతు ప్రకటిస్తున్న స్థానికులు

### మాదన్నపేట కూరగాయల మార్కెట్ ధరలు



| కూరగాయలు | కిలో రూ. | కూరగాయలు | కిలో రూ. |
|---|---|---|---|
| ఆలుగడ్డ | 20 | సొరకాయ | 10 |
| టమాట | 24 | క్యాబేజ్ | 12 |
| వంకాయలు | 30 | క్యారట్ | 35 |
| బెండకాయ | 20 | క్యాలీఫ్లవర్ | 20 |
| మిర్చి | 50 | దొండ | 16 |
| గోకరకాయ | 30 | కీర | 20 |
| చిక్కుడు | 50 | దోసకాయ | 16 |
| బిన్నీస్ | 60 | క్యాప్సికమ్ | 35 |
| బీరకాయ | 20 | బీట్‌రూట్ | 20 |
| కాకరకాయ | 20 | | |

ఈ ధరలు నేటి ఉదయం 9.30గంటల వరకు కూరగాయల మార్కెట్‌లో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు